# బాలసాహితి

## మాయ కుంచె

జె. లక్ష్మీరెడ్డి

గోపీ బాల్యంలోనే తల్లి తండ్రుల్ని కోల్పోయాడు. నా అని ఆదరించేవారు ఎవరూ లేకపోవటంచే పిన్నవయసులోనే కట్టెలమ్ముకుని జీవించేవాడు. చురుకైనవాడు. బొమ్మలు వేయటమంటే ఎక్కడలేని సరదా. కాని కుంచె కొనుక్కోటానికి వాడికి తాహతేది?

ఒకనాడు గోపీ డ్రాయింగు నేర్పే స్కూలుకు వెళ్లి మాష్టరు కుంచెతో చిత్రిస్తున్న బొమ్మలోని ఒంపులను చూసి తన్మయుడై అడిగాడు:

"ఏమండీ, నాకూ డ్రాయింగు నేర్చుకోవాలని వుంది. మీరో కుంచె ఇవ్వగలరా?"

మాష్టరు ఆశ్చర్యంతో, "ఏమిటీ! నీవా? వేలెడున్నావో, లేదో! ఏం నాయనా, కల కంటున్నావా, పాపం!" అని హుంకరించి వాడిని తరిమికొట్టాడు. గోపీ హతాశుడయ్యాడు. తన అభిమతం మాత్రం మార్చుకోలేదు. "బీదవాడినైనంత మాత్రాన నేనెందుకు నేర్చుకోగూడదూ?" అనుకున్నాడు.

మనసు దృఢపరచుకొని ఎలాగయినా నేర్చుకు తీరాలనే పట్టుదలతో కార్యసాధనకు పూనుకున్నాడు. కట్టెలు ఏరుకోటానికి అడవికి వెళ్లినపుడు కాకి ఈక సంపాదించి ఇసుకమీద పక్షులను గీసేవాడు. నదికి వెళ్లినపుడు చేపలను వ్రాసేవాడు. ఇంట్లో అనేకరకాలయిన బొమ్మలను నాలుగుగోడలు నిండేంతవరకు వేసేడు.

రోజులు గడిచిపోతున్నయ్. గోపీ కార్యసాధనలో ఒక్క రోజు గూడ నాగాపడనీయలేదు. కొంతవరకు ఆరితేరాడని చెప్పొచ్చు. అతని చిత్రాలలో జీవం ఉట్టిపడుతూండేది. కాని గోపీకి ఇంకా కుంచె లభించలేదు. అప్పుడప్పుడూ తనకు ఒక కుంచెవుంటే ఎంత బావుండునని అనుకునేవాడు.

ఓ రాత్రి, రోజంతా పనిచేసి అలిసిపోయి ఎప్పటికంటె తొందరగా నిద్రపోయాడు. తెల్లటి గడ్డంతో ఒక వయోవృద్ధుడు వచ్చి ఓ కుంచె ఇచ్చాడు.

"ఇది చాలా చిత్రమయిన కుంచె! చాలా జాగ్రత్తగా వాడుకోవాలి! తెలిసిందా?" అన్నాడు వృద్ధుడు. గోపీ అది తీసుకున్నాడు. బంగారం మెరిసినట్లు ధగధగ మెరిసిపోతోంది.

"అబ్బ! ఎంత అందంగా వుంది! మీకు సర్వదా కృతజ్ఞుడ్ని......" అన్న గోపీ మాటలు పూర్తిగాకముందే వయోవృద్ధుడు అదృశ్యమైనాడు. గోపీకి మెలకువ వచ్చింది. చుట్టూ చూశాడు. ఎప్పటి పాత ఇల్లే! అయితే కలై వుండాలి! కాని ఆ కుంచె చేతిలో వుండగా నేకలెలా అవుతుంది?- సంభ్రమాశ్చర్యాలతో ఎప్పుడు తెల్లవారుతుందా అని నిద్ర లేకుండానే గడిపాడు.

ఉదయమే లేచి క్రొత్తకుంచెతో ఓ పక్షిని చిత్రించాడు. అది రెక్కలు దులుపుకుని ఆకాశంలో ఎగురుతూ చక్కగా గానంచేసి అతనిని తన్మయుణ్ణి చేసింది. ఓ చేపను గీశాడు. అది తోక ఊగిస్తూ నీళ్ళల్లోకి దుమికి ఆడుతూ అతనికి ఆహ్లాదాన్ని కలుగజేసింది.

గోపీ కుంచెతో ప్రతిరోజు తన ఊళ్లో బీదలకు ఏ వస్తువు లేదో తెలుసుకుని ఎవరికి కావలసినవి వాళ్ళకు చిత్రించి వాటి నిజస్వరూపంతో ఇచ్చేవాడు.

ఏ రహస్యమైనా ఎల్లకాలం దాగటం దుస్సాధ్యం. గోపీ మాజిక్ బ్రష్‌ను గురించిన వార్త తొందరలోనే ఆ గ్రామ భూస్వామి చెవిని

పడ్డది. వెంటనే తన మనుషులిద్దరిని పంపి తన కవసరమయినవి గ్రీయ మని బలవంత పెట్టాడు. గోపీ పిన్న వాడయినా చచ్చేంత ధైర్యంవుంది. ఆఊళ్ళో భూస్వాముల దురాగతాలు వాడెరిగినవే. అయినా వెరువక ఒక్క చిత్రాన్ని కూడా ఇవ్వటానికి అంగీకరించలేదు. భూస్వామి వాడి నోగదిలో బంధించి బాధించ సాగాడు.

మూడు రోజులు గడిచాయ్. ఆ రోజు మంచు దట్టంగా పడుతోంది. కొద్దిగా ఎండెక్కేప్పటికి భూమి మీద మంచు పేరుకుపోయింది. ఆకలికి గాకపోయినా శీతలానికి గోపీ చచ్చివుంటాడని భూస్వామి వాడిని చూద్దామని వెళ్ళేడు. గది తలుపు తెరిచి చూస్తే ఇంకేముంది? ఎదురుగా మండుతున్న కుంపటి దానిమీద తయారవుతున్న ఆహారం, ప్రక్కనే కూర్చుని రొట్టెలు ఆరగిస్తున్న గోపీని చూడటంతో భూస్వామి తనకళ్ళను తనేనమ్మలేక పోయాడు. ఈ కుంపటి, రొట్టెలు ఎక్కడనుంచి వచ్చాయ్? ఇవన్నీ వాడే చిత్రించివుంటాడని అప్పుడు తెలుసుకున్నాడు భూస్వామి. పగతో మండిపడి వెంటనే వాడిని చంపి ఆ బ్రష్ నాశనం చేయమని తన మనుషులకు ఆజ్ఞాపించాడు.

వాళ్ళు గదిలో ప్రవేశించే సమయానికి గోడకు త్రాడు మాత్రం వేలాడివుండటం చూశారు. 'భూస్వామి మరి ఆలస్యం చేయక తనూ తాడుపైకి ఎగబ్రాకాడు. చివరికి చేరుకునేలోగా కాలుజారి క్రింద పడిపోయాడు. తిరిగి లేచేలోగా గోపీ మాయమైనాడు.

భూస్వామి బారినుండి తప్పించుకున్న గోపీ ఎక్కడకు వెళ్దామా అని ఆలోచించేడు. ఆ ఊళ్లోనే దాగితే తన్ను దాచిన మిత్రులకే కష్టాలు తప్పవు. కాబట్టి ఆ చాయ విడిచి దూరంగా వెళ్ళడమే మంచిది.

అప్పుడే ఓ చక్కని అశ్వాన్ని చిత్రించి దాని నధిరోహించి రయ్ మని బయల్దేరేడు. కొద్ది దూరం వెళ్లాడో లేదో వెనుక గందరగోళం వినిపించింది. వెనుతిరిగి చూసేడు. భూస్వామి అనుచరులతో గుర్రాల మీద వెంబడిస్తున్నాడు. భూస్వామి చేతిలో పెద్ద బల్లెం వుంది.

తొందరలోనే వాళ్లు సమీపించారు. గోపీ తన మాయ కుంచెతో ఎక్కుపెట్టిన బాణంతో ఓ విల్లు గీశాడు. ఆ బాణం "బుస్"మంటూ వెళ్ళి భూస్వామి రొమ్మును తాకింది. అతడు గుర్రంమీదినుంచి పడి అసువులు బాశాడు. అదే విధంగా తన శత్రువులందరినీ హతమార్చి గోపీ ముందుకు సాగాడు.

రాత్రీ పగలనక కొన్ని రోజులు ప్రయాణం చేశాడు. చివరికి ఒక పట్టణం చేరుకుని అక్కడే నివసించటానికి నిర్ణయించుకున్నాడు. స్వగ్రామానికి అంతులేని దూరంలో వున్నాడు.

అక్కడ ఏమీ పని దొరక్క పోవటం మూలంగా చిత్రాలు వేసి బజారులో అమ్మటం మొదలెట్టాడు. కాని తన నిజస్వరూపం బయటికి రాకుండా వుండేందుకు తన చిత్రాలకు—పక్షులకు రెక్కలు లేకండా,

డ్యూమెక్స్ బెబి ఫుడ్

వారికి డ్యూమెక్స్‌ను యిచ్చి వారెట్లు పెరుగుదురో చూడండి!


అబ్బ! ఒకే జలుబు...భారము...

అమృతాంజనం వాడితే..

తగ్గిపోయింది!
అమృతాంజనము



# ★ మాయకుంచె ★

జంతువులకు ఒక కాలు తీసేసి— జీవం రాకుండా చేశాడు.

ఒకరోజు ఒక కొంగను గీసి అజాగ్రత్తతో కళ్లు తీసి వెయ్యడం మరిచాడు. వక్షి అంతతో కండ్లు తెరిచి, రెక్కలు, చరిచి గగనంలోకి ఎగిరిపోయింది. అది చూడటంతో పట్టణంలో ఆశ్చర్యం, కలకలం బయలు దేరింది. సిపాయీలు కొంతమంది చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. వెంటనే గోపీని కోర్టులో హాజరు పెట్టవలసిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. గోపీకి హాజరవటం ఇష్టం లేదు. కాని సిపాయీలు అభయమిచ్చి, భయపెట్టి తీసుకుపోయారు.

నిరుపేదలను హింసిస్తున్న చక్రవర్తి ఘాతుక కృత్యాల్ని గురించి గోపీ అంతా విన్నాడు. అతని శరీరంలోని ప్రతి అణువూ చక్రవర్తిని అసహ్యించుకున్నది. అటువంటి దుర్మార్గుడికి తను సహాయం చేయబోవటం లేదు.

చక్రవర్తి హంసను గీయమని ఆర్డరిచ్చినపుడు బాతును వేసేడు. నెమలికి బదులుగా కోడిని చిత్రించేడు. ఈ రెండూ కలిసి రాజభవనమంతా నానా ఖరాబు చేశాయి. చక్రవర్తి ఉగ్రుడై కుంచె లాగుకుని, వాడిని జైలులో బంధించమని ఆజ్ఞ ఇచ్చాడు.

ఇప్పుడు కుంచె చక్రవర్తి చేతికి వచ్చింది. దానితో చిత్రించటానికి ప్రయత్నించాడు. మొదట బంగారు పర్వతాన్ని లిఖించాడు. అది ఒక్కటే చాలక ఇంకొకటి, ఇంకొకటి అని డాడాపు కాగితం నిండేంతవరకు గీశాడు. అవి పూర్తవగానే ఏమయిందనుకుంటున్నారు? బంగారు పర్వతాలన్నీ చట్టుబండలుగా తయారయ్యాయి. అవి మరీ ఎత్తవటంవల్ల ఒక్కొక్కటి క్రింద పడి చక్రవర్తి పాదాలకు తగిలి రక్తాన్ని ప్రసాదించాయి.

అయినప్పటికీ చక్రవర్తి మనసు మారలేదు. బంగారు పర్వతాలు విఫలం గావటంతో బంగారు ఇటుకలు చిత్రించటం ప్రారంభించేడు. ఒకటి వేశాడు. చిన్నదిగా వుంది. ఇంకొంచెం పెద్దది గీశాడు. ఊఁహు. ఇంకా చిన్నదిగానే వుంది. చివరికి చాలా పొడవుగా పేద్దది చిత్రించాడు. అలా కొన్ని బార్లు తీర్చాడు. పూర్తవగానే మరల ఏమయిందనుకుంటున్నారు? బంగారు ఇటుకలన్నీ కలిసి పెద్ద కొండచిలువగా మారింది. అది వెడల్పాటి పెద్దనోరు తెరిచి చక్రవర్తిని కబళించటానికి మీదికి వచ్చింది. అదృష్టవశాత్తు సిపాయీలు అదేసమయంలో అక్కడికి రావటంవల్ల చక్రవర్తి రక్షింపబడ్డాడు. లేకపోతే ఆ భయంకర జంతువు వాతబడివుండేవాడు.

ఈ సంఘటనతరువాత ఆకుంచె తనకేమీ ఉపయోగం లేదని తెలుసుకుని గోపీని విడిపించాడు. వాడిని సత్కరించి తీయని మాటలతో యువరాణిని కూడ ఇచ్చి పెండ్లి చేస్తానని మంచిచేసుకో ప్రయత్నించాడు. ఇంతకుముందే వేరే ఎత్తు వేసుకున్న గోపీ చక్రవర్తి చెప్పిన వాటన్నిటికీ అంగీకరించినట్టు నటించాడు.

"ఏడు పర్వతాలు చిత్రిస్తే భయంకర జంతువులు బయటికి

రావచ్చు. ఎందుకయినా మంచిది సముద్రం వేయనీ!" అనుకున్నాడు చక్రవర్తి.

వెంటనే సముద్రం చిత్రించమని గోపీకి ఆజ్ఞ యిచ్చాడు.

గోపీ కుంచె తీసుకుని అంచులు లేని అనంత సముద్రాన్ని లిఖించాడు అది నీలంరంగుతో మెరిసిపోతూ, పెద్ద భూతద్దంలా ప్రకాశించింది.

"ఈ సముద్రంలో చేపలు లేవు, ఎందుకని?" అడిగాడు చక్రవర్తి.

గోపీ చేపలను గీశాడు. అవి ఇంద్ర ధనస్సులో వుండే ఏడురంగులతో ప్రత్యక్షమయినయ్. తోకలు ఆడిస్తూ కాసేపు ఉల్లాసాన్ని కలిగించి లోపలకు తుర్రుమన్నయ్. చక్రవర్తి ఇదంతా ఆనందతన్మయత్వంతో పరీక్షిస్తున్నాడు. అవి దూరదూరంగా పోవటంతో,

"ఆ చేపలను చూడటానికి సముద్రంలో ప్రయాణంచేయ బుద్ధవుతోంది. తొందరగా ఓడ వెయ్!" అని అర్థించాడు గోపీని. వెంటనే గోపీ ఒక పెద్ద పడవ సృష్టించాడు. అందులో చక్రవర్తి, చక్రవర్తి భార్య, యువరాజులు, యువరాణులు, మహామంత్రులు అంతా ఎక్కారు. గోపీ కొద్ది గుర్తులు పెట్టి గాలిని కల్పించాడు. సముద్రంలో అలలు అందంగా లేచాయి. పడవ ఉల్లాసంగా ఊగుతూ లోపలకు వెళ్తోంది.

చక్రవర్తికి గాలి నెమ్మదిగా వస్తున్నట్టుంది. పడవచివరనించి గోపీతో అన్నాడు బిగ్గరగా—

"గాలి ఇంకా ఎక్కువగా రానీ! ఇంకా...! ఇంకా!" గోపీ మాజిక్ బ్రష్‌తో బలీయమైన చుక్కలు పెట్టి పెద్దగా గాలి పంపాడు. సముద్రంలో అలలు అల్లకల్లోలమయినయ్. గోపీ ఇంకా కొద్ది చుక్కలు పెట్టాడు. బ్రహ్మాండమైన తుఫాను బయలుదేరింది. పడవ అటూ ఇటూ ఊగుతోంది. పడవలో అందరికీ భయం వేసింది. చక్రవర్తి బిగ్గరగా అరిచాడు-"ఆ గాలి చాలు! నే చెపుతున్నాగా! చాలు, చాలు!"

గోపీ ఇదేమీ వినపడనట్టు నటిస్తూ ఇంకా ఇంకా పంపుతున్నాడు గాలిని. సముద్రం భయంకరమయింది. తీవ్రమయిన తుఫానుకు వెలుతురుపోయి అంతా అంధకారమయింది. హోరుమని గాలి ఎక్కువవుతూనే వుంది. చక్రవర్తి ఇంకా అరుస్తూనే వున్నాడు. గోపీకి అదేమీ వినిపించినట్టు లేదు. తన పనిలో తను లీనమైనాడు. సముద్రం బీభత్సంగా ఉంది. పడవ మునిగిపోయింది. చక్రవర్తి పరివార సమేతంగా సముద్రంఅట్టడుగున చేరాడు.

చక్రవర్తి మరణానంతరం గోపీ కుంచెనుగురించిన వార్తలు చాలా వరకు వ్యాపించాయి. కాని ఇంతకూ గోపీ ఏమయినట్టు?—ఎవరికీ తెలియదు.

స్వగ్రామానికి వెళ్లి రైతాంగంలో కలిసిపోయాడని కొంతమంది ఊహాగానం చేస్తారు.

మరి కొంతమంది పేదలకు సహాయం చేస్తూ పాద సంచారం చేస్తున్నాడంటారు. ★


# రు. 5 లకు పార్కర్ కలము

ప్రపంచ ప్రసిద్ధిపొందిన పార్కర్ ఫౌంటెన్ కలము రు. 5/-లకు ఎక్కడైనా పొందగలరా? లేదు. ఎక్కడా లభ్యంకాదు. అయితే, మా విశేష తయారీ ఫౌంటెన్ కలముల అమ్మకమును జోరుగా సాగటానికిగాను, 1,000 పార్కర్ జూనియర్ సరికొత్తరకం ఫౌంటెన్ కలములను ఒక్కొక్కటి రు 5/-ల ధరకు, యివ్వదలచి యున్నాము. మీరు యీ అవకాశాన్ని వదులుకోకుండా వినియోగింపతలచుకొంటే, నేడే ఆర్డరు చేయండి.

ప్యాకింగు, పోస్టేజి రు. 1/4 అదనంగా అవుతుంది.

నోట్:—ఏ స్కీము క్రింద ఈ ఏర్పాటు జరగటం లేదు.

ఆర్డరు చేరిన వెంటనే కలము సప్లయి చేయబడును.

JOLLISONS - Post Box No. 1044, Delhi (P)








కాశ్మీర్ శాలువ రు. 2/8-



96'' × 56''
సెజా ధర రు. 2/8-
పోస్టేజీ రు. 1/2. వరకు
పరిమితంగా ఉన్నవి
నేడే వ్రాయండి.

GENERAL SUPPLY CO,
P. B. 1360, (A. P. M.) Delhi.